# బస్సు ఆగింది - పోయింది

రామచంద్రరావు బస్సు దిగాడు. అటూ ఇటూ దిక్కులు చూస్తూ నిలబడ్డాడు. బస్సు బంయి మని మోత చేసుకుంటూ వెళ్ళిపోయింది.

చల్లని గాలి వీస్తోంది. ప్రకృతి శోభాయమానంగా తలూపింది. రామచంద్రరావుకి అంతా కొత్తగావుంది.

అలాగే, ఒక్కక్షణం నిలబడి, ఆలోచించుకున్నాడు. ఎంత కాలమయింది? ఏడాది... ఇంతలో ఎంతమార్పు! కాలిదారినేబయల్దేరాడు. దారికి రెండుపక్కలా చెట్లూ, పొదలూ... ఆలోచించుకుంటూ వెల్తున్నాడు:—

ఆమెను విడిచిపెట్టి ఎన్నాళ్లు వున్నాను!... నన్ను గురించి ఏమనుకుంటుందో... ఇప్పుడు నన్ను చూచి ఏమంటుందో!

శరీరం పులకరించింది. పక్కనున్న చెట్ల తొర్రలోనుంచి వొక గుడ్లగూబ తుర్రున ఎగిరిపోయింది. చెట్లసందులనుంచి గాలి రివ్వున వీచింది. చెట్లు తలలూపినయ్!...

రామచందర్రావుకి చలీ, దాంతో ఒక విధమయిన భయమూ వేసింది. కాలరు పైకితీసి కంఠాన్ని ఆదుర్దాగా చేత్తో కప్పుకొని చెట్ల సందుల్లో పడి గబగబా నడిచిపోయాడు.

ఆ వూరు రోడ్డుకి దగ్గర దగ్గర మైలుంటుంది. అతడు అటూ ఇటూగా రెండు ఫర్లాంగు లుంటుందనుకున్నాడు—ఎంత నడిచినా తరగదు.

ఆగలేక కొంచం దూరం పరుగెత్తాడు.

ఊరుప్రవేశించాడు_ఒక్కనిట్టూర్పు విడిచాడు. కాని అతనికి

ఉత్సాహంగా లేదు—ఊరంతా మాటుమణిగివుంది. అతడుఅలాగే నడిచాడు. ఒక ఇంటి దగ్గర ఆగి తలుపుకొట్టాడు.

లోపలనుంచి: "ఎవరు ?"

"నేనే"

"పేరుచెప్పరాదూ ?"

కంఠం గుర్తుపట్టాడు. కష్టంవేసింది. "నా కంఠధ్వనికూడా మరచిపోయారు. నాపదాలచప్పుడు వినే నన్ను గుర్తించేవారు. ఇప్పుడు..."

ఆమె తలుపు తీసింది.

"ఎవ్వరూ ?"

గుర్తుపట్టింది—

"మీరా..." ఇంట్లోకి వెళ్ళింది.

"ఎంత మారిపోయింది ? ఎంత అందమొచ్చింది !!"

అతడు వెనుకనే వెళ్ళాడు.

పొయ్యివద్ది కళ్ళునలుపుకుంటూ, "ఎవ్వరే అమ్మాయీ!" అని అడిగింది తల్లి.

ఆమె మాట్లాడలేదు.

ఆమె తండ్రి నోట్లోనుంచి చుట్టతీసి ఉమ్మేసి, "ఎప్పుడు వచ్చారు ?" అని ప్రశ్నించాడు.

"ఇప్పుడే వస్తున్నా."

"కూర్చోండి, నిలబడ్డారే !" అన్నది ఆమెతల్లి. రామచంద్రావు కూర్చున్నాడు. కాని అతనికి భూకంపంమీద కూర్చున్నట్లుగా వుంది. ఆమె "నీవు నీవు" అనేది. ఇప్పుడు "మీరు" అంటున్నది. ఆమెతల్లి "బాబూ బాబూ" అంటూ తలనిమిరేది.

ఇప్పుడు "కూర్చోండి" అంటున్నది. ఆమె తండ్రి "అబ్బాయీ" అనేవాడు. ఇప్పుడు "ఎప్పుడొచ్చారు" అంటున్నాడు. ఇందు కేనా తా నంతదూరంనుంచి కాళ్ళుకొట్టుకొంటూవచ్చింది? ఈ మార్పుకి కారణం ?...

ఆమెతండ్రి ప్రశ్నించాడు.

"యుద్ధ విశేషాలేమిటి ?"

రామచంద్రరావుకి యుద్ధం సంగతి పట్టలేదు. "వీళ్ళలోని మార్పుకి ఏమిటి కారణం ?"

ఆమెతల్లి మళ్ళా పొయ్యి వూదుతూ ఉంది. పొగ నోట్లోకి వెళ్ళి దగ్గింది. తండ్రి చుట్ట తాగుతూ తాగుతూ తుపుక్కున ఊశాడు. ఆమె తలెత్తకుండా జాకెట్టు కుట్టుకుంటూ ఉంది. సూది వేలిలో గుచ్చుకుంటే గబుక్కున నోట్లో పెట్టుకుంది. అతడు గదంతా చూచాడు. మహా చిందరవందరగా వుంది. వాళ్ళు యిదివరకటికంటే ఎక్కువ దారిద్ర్యం అనుభవిస్తున్నారని గ్రహించాడు.

ఆమె అన్నా తమ్ముడూ ప్రవేశించారు. తమ్ముడు గంతులు వేసుకుంటూ తండ్రిదగ్గరకువచ్చి, "సుభాస్ బాబుని వర్కింగ్ కమిటీవారు పిలిచారు," అని చెప్పాడు.

"ఆ, నేను చెప్పలా!" అన్నాడు తండ్రి సంతోషంగా.

ఆమె అన్ననడిగింది. "గాంధీ వైస్రాయి సంభాషణలు ఏమైనవి ?"

అన్న చెప్పాడు – "ఇంకా యేమీ తెలియలేదు."

తమ్ముడు, "అదికాదే అక్కా! ఒకరినొకరు కౌగలించుకొని కన్నీరు కార్చారట."

ఆమె నవ్వింది.

తల్లి పొయ్యి ఊదటం మానివేసి, "అమ్మో, పాపం నాబిడ్డ కెంతకష్టమొచ్చిందే!" అంది.

"నేను చెప్పలా ? సమయంవస్తే నాయకులంతా ఒక టౌతారు," అన్నాడు తండ్రి.

తమ్ముడు అన్నాడు: "ఎట్లా అవుతారు ? ఏవో కొన్ని హక్కులు తీసుకొని రాజీ చేసుకుందామంటాడు గాంధి. సంపూర్ణస్వరాజ్యం ఇస్తేగాని కుదరదంటారు తీవ్రవాదులు."

నాయకులలో సమయానికి ఐకమత్యం కుదరదేమోనని విచారపడ్డాడు తండ్రి.

"గాంధీగారు చెప్పినట్లు పోగూడదూ?" అన్నది తల్లి.

"ఎందుకు పోవాలి!" అన్నది ఆమె...

రామచంద్రరావు ఇంటి కప్పువైపు చూస్తూ వింటున్నాడు. అతనిని ఎవరూ గమనించినట్లే లేదు. అతని కంతా గందర గోళంగా ఉంది. అతని అవస్తను ఆమె గ్రహించింది. దగ్గరకు వచ్చి—

"భోజనం చేశారా?"

"చేశాను." అబద్ధమాడాడు.

ఆమెకు ఇంకా మాట్లాడవలసిందేమీ కనబడలేదు. మళ్ళీ వెళ్ళి సంభాషణలో పాల్గొన్నది.

ఈసారి రష్యా...

"ఈ యుద్ధం రష్యాకు లాభం"

"దానికేం లాభం ? అది తటస్థంగానే ఉందిగా!" అన్నాడు తండ్రి.

"కేపిటలిస్టు దేశాలు యుద్ధం చేసుకొని బలహీన మవటం రష్యాకు లాభం కాదూ ?" అన్నాడు తమ్ముడు.

"రష్యా రాజనీతికి జేజేలు"-అన్న.

రామచంద్రరావు ఉక్కిరి బిక్కిరి అవుతున్నాడు. వారి సంభాషణ జవహర్‌లాల్ మీాదికి తిరిగింది.

ఆమె అడిగింది – "ఆయన చైనా ఎందుకు వెళ్లినట్టూ ?"

"చైనామీాద పెద్ద పుస్తకం రాస్తాడు" అన్నాడు తమ్ముడు.

తల్లి అందుకుంది. "పెద్దలను తృణీకరించ గూడదు."

"తృణీకార మేముంది? పుస్తకం రాయటం తప్పా!" అన్నాడు తండ్రి.

రామచంద్రరావు ఇక కూర్చోలేక పోయాడు. నెమ్మదిగా లేచి బయటపడ్డాడు. వాళ్ళ సంభాషణలో వాళ్లున్నారు.

రామచంద్రరావు గబగబా రోడ్డువైపు నడిచాడు. బజారులో కుక్కలు బొయ్యిమన్నై. ఒక సోదిచెప్పేది అడ్డువచ్చి తొలిగి పోయింది. అతడు అలాగే పోతున్నాడు—.

"ఏమిటిది? నేనంటే ఎంత ప్రేమగా ఉండేవారు! ఎందు కొచ్చిందీమార్పు ? ఆమె......ఆమె......" చలికి కాలరు పైకితీసుకుని గబగబా నడిచాడు. "నాతో నే ప్రపంచమనేది! ఎన్నికబుర్లు చెప్పుకున్నాం. ఎన్నిచోట్ల తిరిగాం... వాళ్ళ హృద యాలలో ప్రేమ లేదు."

ఆలోచించుకుంటూ రోడ్డుదగ్గరకు వచ్చాడు. ఒక చెట్టు క్రింద కూర్చున్నాడు. నక్కలు కూసినై.

"ప్రేమ ... ప్రేమ లేదనటానికివీలులేదు. గాంధీమీాద ఎంత ప్రేమచూపించారు...సుభాస్ బాబుని ఎంతపొగిడారు ... రష్యా

మీదో ... ప్రేమ ఉంది ... వాళ్ళ హృదయాలు ప్రేమతో తొణికిసలాడుతున్నై...కాని అది దేశంమీదికి మళ్ళింది ... అవును."

—తానో ... తన సంగతి ఆలోచించుకుంటే తనకే చికాకు పుట్టింది. తాను వేసుకున్న ఇస్త్రీ బట్టలమీద అసహ్యం పుట్టింది. నున్నగా దువ్వుకున్న క్రాపుమీద అసహ్యం పుట్టింది.

"ప్రేమ! దేశం!!"

బస్సు ఆగింది.

అతడు నిలబడ్డాడు.

కండక్టరు అడిగాడు, "వస్తారా?"

"రాను."

బస్సు వెళ్ళిపోయింది.

అతడు కూర్చున్నాడు. అలాగే కూర్చున్నాడు. ఆ చెట్టు క్రిందే!

★

## భూ త ద య

"నువ్వు దేశానికి చాలా అపకారం చేస్తున్నావు. నీ తృప్తీ సుఖం నీదిగాని, ఇతర్ల సంగతి ఆలోచించవు," అన్నాడు.

నా కార్చర్యంవేసి, ఎవ్వరా అని తిరిగి చూశాను. నాపక్కనే కూర్చుని వున్నాడు. చింపిరిగుడ్డల్తో, మాసిన గడ్డ